కథ

# సర్వెంట్ మెయిడ్స్ మేడ్ ఇన్ హైదరాబాద్

- ఎ.ఆర్.స్వామి

**మా** కాలనీ వీధులు ఉదయం ఆరుగంటల కల్లా, పనిమనుషులు గుమ్మాలు, వాకిళ్ళు కడిగి, ముగ్గులు పెట్టే హడావుడితో శుభోదయం, సుప్రభాతం పలుకుతాయి. కాలనీ పనిమనుషులందరిలో పద్మాసిస్టర్స్ జాబ్ చాలా ఫేమస్. వాళ్ళు ముగ్గురు అప్పచెల్లెళ్ళు. ముగ్గురూ చాలా శుభ్రంగా, హుందాగా, హై... ఫై.... స్టయిల్‌లో ఉంటారు.

పద్మా సిస్టర్స్ ఒక్కొక్కరు పదేసి ఇళ్ళ చొప్పున కాలనీలో మొత్తం ముప్పై ఇళ్ళలో పనిచేస్తూంటారు. ఏ ఇంట్లోనూ ఇరవైనిమిషాల కంటే ఎక్కువసేపు పనిచేయరు. బట్టలు ఉతకడం, అంట్లుతోమడం పనులకి ఒక్కో ఇంటికి నెలకి దాదాపు నాలుగు వందల రూపాయల దాకా వసూలు చేస్తూంటారు. పై రెండు సేవలే కాకుండా, కొందరు బాచ్‌లర్స్‌కి వంట కూడా చేసిపెడ్తూంటారు. వంట కూడా సర్వీస్ లిస్ట్‌లో ఉంటే ఒక్కో ఇంటికి నెలకి దాదాపు పన్నెండు వందలు తీసుకుంటారు.

ఆ ముగ్గురి సిస్టర్స్‌లో పద్మ పెద్దది. చలాకీగా చురుగ్గా తన పనిని తాను చేసుకుంటూ ఉంటుంది. ఇంటి పనులన్నీ బాగా చేస్తుంది. వాళ్ళ ముగ్గురికీ లీడరు ఆమే. ఈ సిస్టర్స్‌కి కొన్ని రిజిడ్ రూల్స్ అండ్ రెగ్యులేషన్స్ ఉంటాయి. వీళ్ళలో ఎవరయినా ఆరోగ్యం బాగోక పనికి రావడం మానేస్తే, ఆ ఇంటి పనిని మరొకరు ససేమిరా ముట్టుకోరు.

ఎప్పుడయినా పద్మ పనికి రానిరోజున మిగతా సిస్టర్స్ పనికి హాజరయినప్పుడు 'ఈరోజు మా పద్మ పనికి రాదమ్మా! వంట్లో బాగోలేదు' అన్న సమాచారం అందజేస్తారు. 'ఈరోజు పద్మ పనికి రాదు కాబట్టి ఆమె పని ఎవరో ఒకరు చేయండి' అని ఎవరయినా అడిగితే, 'మేమెప్పుడైనా పనికి రాలేనప్పుడు మా పని మా అక్క చేస్తుందామ్మా? అంతే కాక మీ ఒక్క ఇంటికీ వస్తే మిగతా తొమ్మిదిళ్ళవాళ్ళూ

> **హైదరాబాద్‌లో భూ కబ్జాల మాదిరిగానే పనిమనుషుల కబ్జాలు కూడా మా కాలనీలో జరుగుతూంటాయి. 'ప్రక్క వాళ్ళ కంటే నేనొక యాభై రూపాయలు ఎక్కువిస్తాను మా యింటికిరా! మా యింటికిరా!' అని బేరసారాలు జరుగుతుంటాయి. అటువంటి బేరసారాలను లాభదాయకంగా మార్చుకోవడంలో దిట్టలు ఈ పద్మాసిస్టర్స్.**

ఊరుకుంటారామ్మా? మా ఇళ్ళ పనులు చేస్తూ మా అక్క ఇళ్ళ పని కూడా చేయడం మావల్ల కాదమ్మా' అని తెలివిగా తప్పుకుంటారు.

ఇంతే కాదు వాళ్ళకి నెలలో ఒకరోజు 'కంపల్సరీ హాలీడే' ఇవ్వాలి. ఇక అప్పుడప్పుడు నాగాలు సరేసరి. వీళ్ళ 'లీవ్' (నాగా) వివరాలు సెల్‌ఫోన్ ద్వారా వాళ్ళ యజమానులకి తెలియజేస్తుంటారు. ఎంచేతనంటే...! నువ్వు వస్తావనుకుని మేటెడు బట్టలు నానబెట్టాను. తిరిగి నేనే ఉతుక్కోవలసి వచ్చింది. "నువ్వు వస్తావని ఎదురుచూసి, చూసి నేనే వండుకోవలసి వచ్చింది' అనే కామెంట్స్ మర్నాడు పనికి వచ్చినప్పుడు వినడంవాళ్ళకి ఇష్టంలేక.

ఓ ఇంటావిడ ఒకసారి పద్మనడిగింది 'ఏం పద్మా! ప్రతినెలా పదకొండో తారీఖున తప్పనిసరిగా సెలవు తీసుకుంటావు. ఆరోజు ఏంచేస్తావేం?'

'ఏం లేదమ్మా! మా పనిమనుషులందరం కలిసి ఒక చిట్టీ సంస్థ నడుపుతున్నాం. నెలకు వందరూపాయల చిట్టీ. మేం మొత్తం వందమంది మెంబర్స్. ఆ మీటింగ్, ఆక్షన్ వగైరా పనులు ఆరోజు చూస్తుంటానమ్మా!' అని సమాధానం ఇచ్చింది.

ఇకపోతే బాచ్‌లర్స్‌కి వంటలు చేయడానికి వేరే సమయాన్ని కేటాయిస్తారు. ఉదయం ఆరుగంటలకి మొదలయ్యే వీరి రొటీన్ మధ్యాహ్నం మూడు గంటలకి ముగుస్తుంది. వీళ్ళ డ్యూటీ లిస్టు ప్రకారం రోజుకి ఒకపూట మాత్రమే పని చేస్తారు. రెండోపూట పనిచేయడానికి వీళ్ళకి వీలుపడదు. ఎందుకంటే వీళ్ళ భర్తలు చేయి తిరిగిన ఒంగోలు మేస్త్రీలు. వాళ్లు హైటెక్ సిటీ ఏరియాలో ఎపార్ట్‌మెంటుల్లో సిమెంట్ పనులు చేస్తూంటారు. వాళ్ళు అలసి సాయంత్రం ఇంటికి చేరే వేళకి వేడివేడిగా అన్నం వండి పెట్టాలీ సిస్టర్స్. అంచేత మధ్యాహ్నం మూడుగంటల కల్లా ఇళ్ళపనులన్నీ ముగించుకుని చెట్టాపట్టాలు వేసుకుంటూ ఇల్లు చేరుతారు.

బాచిలర్స్‌తో వీళ్ళ డీలింగ్స్ విచిత్రంగా ఉంటాయి. ఒకసారి పద్మ సిక్ అయినపుడు ఆమె ట్రీట్‌మెంట్ కయ్యే ఖర్చంతా బాచ్‌లర్సే భరించారు. దీంట్లో వాళ్ళ స్వార్థం కూడా కొంచెం ఉందనుకోండి. పద్మ త్వరగా కోలుకుని పనిలో జాయిన్ అయితేగాని వీళ్ళకి 'ఫుడ్' వుండదుకదా! అందుకని పద్మని సుకుమారంగా చూసుకుంటారు వాళ్ళు. బాచ్‌లర్స్ ఇంటితాళాల సెట్ ఒకటి పనిమనిషి పద్మ హాయాంలో ఉంటుంది. ఒకరోజున జోరుగా వానపడుతుంటే, ఈ పద్మా సిస్టర్స్ బాచ్‌లర్స్ రూములోంచి మూడు గొడుగులు తీసుకుని చక్కగా ఇంటికి చెక్కేసారు. బాచ్‌లర్స్‌కి మర్నాడు గొడుగులవసరమొచ్చి చూసుకునేసరికి అవి ఉండవలసిన స్థానంలో లేవు. ఎవరు తీసారు చెప్మా? అని బాచ్‌లర్స్ ఆతృతపడుతుండగా, 'నిన్న వర్షం పడుతుంటే అవసరమొచ్చి తీసుకున్నాం సారూ! ఇవిగో మీ గొడుగులు' అని ఇచ్చారు. బాచ్‌లర్స్ రూముల్లో లేనప్పుడు వంటచేస్తూ వాళ్ళ పౌడర్లు, సెంట్లూ మొహమాటం లేకుండా వాడేస్తుంటారు.

ఈ ముగ్గురు సిస్టర్స్ గ్రూప్ డిస్కషన్స్ పెట్టి ఆర్నెల్ల కొకసారి జీతం పెంచమని డిమాండ్ చేస్తూంటారు. వాళ్ళ పనితనం, పంక్చువాలిటీ చూసి మరో గత్యంతరం లేక వాళ్ళ కోరికని తీరుస్తుంటారు ఆ కాలనీ యజమానులు.

హైదరాబాద్‌లో భూ కబ్జాల మాదిరిగానే పనిమనుషుల కబ్జాలు కూడా మా కాలనీలో జరుగుతూంటాయి. 'ప్రక్క వాళ్ళ కంటే నేనొక యాభై రూపాయలు ఎక్కువిస్తాను మా యింటికిరా! మా యింటికిరా!' అని బేరసారాలు జరుగుతుంటాయి. అటువంటి బేరసారాలను లాభదాయకంగా మార్చుకోవడంలో దిట్టలు ఈ పద్మాసిస్టర్స్.

వాళ్ళ కార్యకలాపాలు సెల్‌ఫోన్ ద్వారానే సాగిస్తూంటారు. ఏ ఇంట్లో పనిమనుషులవసరం. ఏ ఇళ్ళు ఎప్పుడు ఖాళీ అవుతున్నాయి అన్న సమాచారాన్ని సెల్‌ఫోన్ ద్వారా తెలుసుకుంటుంటారు. కాలనీలో ఏవైనా ఇళ్ళు ఖాళీ అయితే కొత్తవాళ్ళు అద్దెకు దిగేముందు, బూజులు దులిపి ఇల్లు కడిగే కాంట్రాక్ట్ తీసుకుంటుంటారు. ఇలాంటి చిల్లర పనులకు వాళ్ళ రేటు వందరూపాయలు. వీళ్ళు ఏ ఇంటికి పనికి వెళ్తారో ఆ పనివేళల బట్టి బ్రేక్‌ఫాస్ట్, లంచ్, స్నాక్స్, టీ, కాఫీ వగైరా తప్పనిసరిగా వాళ్ళకివ్వాలి లేదా ఇంటి యజమాని మీద కోపం గిన్నెలమీద చూపిస్తారు.

❀❀❀

కొన్నాళ్ళు గడిచాక ఈ పద్మా సిస్టర్స్ కాలనీలో కనుమరుగయ్యారు. కాలనీ వెలవెలబోయింది. కళావిహీన మయిపోయింది. వాకబు చేస్తే తెలిసింది. ఈ పద్మా సిస్టర్స్ తమ వృత్తిలో దినదినాభివృద్ధి చెంది, హైటెక్ సిటీ ఏరియాలో ఒక కన్సల్టెన్సీ కంపెనీ స్థాపించారని, దాని పేరు 'పద్మామెయిడ్స్ డాట్‌కామ్'! ఇప్పుడు వాళ్ళు ఇళ్ళ పనులకి స్వస్తి చెప్పి పనిమనుషులవసరమయిన వాళ్ళకి పనిమనుషు లను సరఫరా చేసే పనిలో బిజీగా ఉన్నారు. హేట్సాఫ్ టు 'పద్మాసిస్టర్స్'.

❀❀❀❀❀

**రాము** : అరే శ్యామూ ! రాత్రి మా ఇంటి తాళం పగలగొట్టి, దొంగలు అయిదు లక్షలు దోచుకుపోయార్రా!

**శ్యాము** : అరే! విచిత్రంగా ఉందే! అయిదు లక్షలు తాళం కప్పలో ఎలా పెట్టావురా !!